మోదీ విజయ సంకల్ప రోడ్ షోకు బీజేపీ నాయకులు



ఘట్‌కేసర్ నుంచి విజయ సంకల్ప రోడ్ షోకు బయల్దేరిన హనుమాన్, రామతీర్థ, పార్టీ శ్రేణులు

ఘట్‌కేసర్: మల్కాజ్‌గిరిలో శుక్రవారం నిర్వహించిన భారత ప్రధాని నరేంద్ర మోదీ విజయ సంకల్ప రోడ్ షోకు ఘట్‌కేసర్ నుంచి పెద్ద ఎత్తున బీజేపీ శ్రేణులు తరలివెళ్లారు. అంతకుముందు బీజేపీ మున్సిపల్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శి హనుమాన్, రామతీర్థ, మండల అధ్యక్షుడు ప్రవీణ్‌రావు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మధుగౌడ్, నరేశ్‌ముదిరాజ్, మోహన్‌రావు, సిద్దిరాజు, వీరేశం, రాధిక, చంద్రకాంత్‌యాదవ్, మాధవి, విక్రాంత్‌రెడ్డి, హరికృష్ణ, శరత్, సురేంద్ర, ఉదయ్, పవన్‌దేవ్‌గౌడ్, జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా మాజీ సర్పంచ్ శంకర్‌గౌడ్ వివాహ వార్షికోత్సవం



కారింగుల జ్యోతిశంకర్‌గౌడ్ వివాహ వార్షికోత్సవ శుభాకంక్షలు తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

జవహర్‌నగర్: జవహర్‌నగర్ మాజీ సర్పంచ్ కారింగుల జ్యోతిశంకర్‌గౌడ్ వివాహ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ తోటకూర వజ్రేష్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, సీనియర్ నాయకులు నక్క ప్రభాకర్‌గౌడ్, జవహర్‌నగర్ అధ్యక్షులు మల్లెపూల శ్రీకాంత్‌యాదవ్‌లు హాజరై శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు అనిల్‌కుమార్ ముదిరాజ్, అశోక్‌గుప్తా, దయాకర్‌చారి, సదానందం, రాజు ముదిరాజ్, వినయ్‌కుమార్, లక్ష్మణ్, ఐలయ్య, యాకచారి, వినయ్, యాదగిరి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో పలువురి చేరిక



ఈటల రాజేందర్ సమక్షంలో బీజేపీలో చేరుతున్న నాయకులు

మేడ్చల్‌రూరల్: మండలంలోని ఎల్లంపేట్ గ్రామానికి చెందిన పలువురు నాయకులు బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు జగన్‌గౌడ్ ఆధ్వర్యంలో శుక్రవారం బీజేపీ మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్ సమక్షంలో బీజేపీలో చేరారు. పూడూర్ గ్రామ పరిధిలోని ఈటల నివాసంలో ఎల్లంపేట్‌కు చెందిన రమేశ్, శ్రీనివాస్, శ్రీశైలం, నర్సింహాచారి, అర్షద్, శంకర్‌గౌడ్ తదితరులు పార్టీలో చేరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు విక్రంరెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ మోహన్‌రెడ్డి, మండలాధ్యక్షులు నరేందర్‌రెడ్డి, నాయకులు తిర్మల్‌రెడ్డి, పోచయ్య, రాజేశ్, మహేశ్, నగేశ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

భారతి సిమెంట్‌కు 5 స్టార్ గ్రేడ్



తాపీ మేస్త్రీలకు ప్రమాద బీమా బాండ్లను అందజేస్తున్న భారతి సిమెంట్ టెక్నికల్ ఇంజినీర్ సాత్విక్‌రెడ్డి

పోచారం: భారతి సిమెంట్ 5 స్టార్ గ్రేడ్ కలిగి ఉందని ఆ సంస్థ టెక్నికల్ ఇంజినీర్ సాత్విక్‌రెడ్డి అన్నారు. అన్నోజిగూడలో భవాని స్టీల్ ఏజెన్సీస్ డీలర్ షాప్‌లో శుక్రవారం తాపీ మేస్త్రీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిర్మాణ రంగం నుంచి భారతి సిమెంట్‌కు మంచి ఆదరణ లభిస్తోందని చెప్పారు. భారతి అల్ట్రా ఫాస్ట్ సిమెంట్‌తో నిర్మాణ ప్రక్రియ వేగవంతంగా జరుగుతుందన్నారు. వినియోగదారులకు ఉచిత సాంకేతిక పరిజ్ఞానాన్ని స్లాబ్ కాంక్రీట్ సమయంలో సంస్థ అందజేస్తుందన్నారు. అన్ని రకాల నిర్మాణాలకు భారతి సిమెంట్‌ను ఎంపిక చేసుకోవడం సరైన నిర్ణయమని తెలిపారు. 40 మంది మేస్త్రీలకు రూ.లక్ష ప్రమాద బీమా బాండ్లను అందజేశారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి



బోడుప్పల్: దశలవారీగా మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు 28వ డివిజన్ కార్పొరేటర్ చీరాల నర్సింహ అన్నారు. 28వ డివిజన్ పరిధిలో హనుమాన్ ఆలయం రోడ్డు రూ.15లక్షలతో సీసీ రోడ్డు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలో తాగునీరు, రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, పారిశుద్ధ్యానికి అధిక ప్రాధాన్యం ఇచ్చి సౌకర్యాలు కల్పించినట్లు వెల్లడించారు. రానున్న రోజుల్లో డివిజన్ పరిధిలో మిగిలిపోయిన పనులను పూర్తి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. డివిజన్ అధ్యక్షుడు సంతోష్, సాయి ఎన్‌క్లేవ్ అధ్యక్షుడు శివప్రసాద్, నేతలు పోగుల దిలీప్‌రెడ్డి, కాటపల్లి సత్యంరెడ్డి, ఇంద్రసేనారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

కళారత్న డాక్టర్ భారతికి కీర్తి పురస్కారం

గౌతంనగర్: కేంద్ర ప్రభుత్వ సంగీత నాటక అకాడమీ సభ్యురాలు, కూచిపూడి నాట్య గురువు, కళారత్న లయన్ డాక్టర్ ఎస్‌పి. భారతి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వారు అందించే ప్రతిష్టాత్మకమైన కీర్తి పురస్కారానికి ఎంపికైంది. ఈ నెల 21వ తేదీన నగరంలోని తెలుగు విశ్వవిద్యాలయం, ఎన్‌టీఆర్ కళామందిరంలో ఆమె ఈ పురస్కారాన్ని అందుకోనున్నారు.

అంగన్‌వాడీలు ఇక హ్యాపీగా..

ఈజీఎస్‌లో తొలి ప్రాధాన్యత కేంద్రాలకు సొంత భవనాలు

- ఇటీవలి మహిళా, శిశు సంక్షేమ శాఖ సమావేశంలో సీఎం ఆదేశం
- మేడ్చల్ జిల్లాలో అద్దె భవనాల్లో 443 అంగన్‌వాడీ కేంద్రాలు
- సీసీ కెమెరాలు.. బయోమెట్రిక్ విధానంతోనూ మేలు
- లెక్కలేనన్ని పనుల నుంచి అంగన్‌వాడీలకు ఉపశమనం కలిగే అవకాశం

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాలిలా..

ప్రాజెక్టు	మొత్తం కేంద్రాలు	అద్దె భవనాలు	లబ్ధిదారుల సంఖ్య
కుత్బుల్లాపూర్	311	277	47,028
అల్వాల్	271	143	20,993
మేడ్చల్	211	23	39,463
మొత్తం	793	443	1,07,484

సాక్షి, మేడ్చల్ జిల్లా: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో తొలి ప్రాధాన్యంగా అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు నిర్మించాలన్న ప్రభుత్వం నిర్ణయం పట్ల అంగన్‌వాడీలకు మంచి రోజులు వస్తాయని భావిస్తున్నారు. అలాగే, ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో సీసీ కెమెరాల ఏర్పాటుతో పాటు బయోమెట్రిక్ హాజరు విధానం అమలును కూడా స్వాగతిస్తున్నారు. దీంతో లెక్కలేనన్ని పనులు చేపడుతున్న అంగన్‌వాడీలకు ఉపశమనం కలుగుతుందని అంటున్నారు.



ప్రయోజనం చేకూరుతుందనే అభిప్రాయాలు..

ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన శిశుసంక్షేమ శాఖ సమీక్ష సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అంగన్‌వాడీల మేలుకోరి తీసుకున్న నిర్ణయాలు.. ఆదేశాలతో అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రయోజనం చేకూరుతుందనే అభిప్రాయాలు సంబంధిత వర్గాల్లో వ్యక్తం అవుతున్నాయి. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లావ్యాప్తంగా 793 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, వీటిలో 212 కేంద్రాలు మాత్రం సొంత భవనాల్లో ఉన్నాయి. మిగిలిన 138 కేంద్రాలు వివిధ వర్గాలకు సంబంధించిన సామాజిక భవనాల్లో మనుగడ సాగిస్తున్నాయి. 443 అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. ఇవన్నీ ప్రారంభం నుంచి అనేక అసౌకర్యాల మధ్య కొనసాగుతున్నాయి.

తొలి ప్రాధాన్యం కింద..

ముఖ్యమంత్రి ఎన్‌ఆర్‌ఈజీఎస్ తొలి ప్రాధాన్యం కింద అంగన్‌వాడీలకు సొంత భవనాలు నిర్మించాలని ఆదేశాలు ఇవ్వడంతో అధికారులు ఆ దిశగా అడుగులు వేస్తున్నారు. సొంత భవనాలు ఏర్పాటైతే కేంద్రాలకు వచ్చే గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు కనీస వసతులు సమకూరుతాయి. ప్రస్తుతం సామాజిక, అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న కేంద్రాల్లో కనీస వసతులు లేవు. మూత్రశాలలు, మరుగుదొడ్లు అంతంత మాత్రంగానే ఉన్నాయి. దీంతో గర్భిణులు, బాలింతలు, చిన్నారులు నిత్యం కేంద్రాలకు వచ్చి ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర సమయంలో మరుగుదొడ్డి కోసం ఇళ్లకు పరుగులు తీయాల్సిన దుస్థితి నెలకొంటోంది.

సీసీ కెమెరాలు, బయోమెట్రిక్‌తో..

సీసీ కెమెరాలు, బయోమెట్రిక్ విధానాన్ని కేంద్రాల నిర్వాహకులు స్వాగతిస్తున్నారు. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ పరంగా ఏ చిన్న కార్యక్రమం నిర్వహించినా.. అంగన్‌వాడీ కార్యకర్తలే గుర్తుకు వస్తున్నారు. గ్రామ సభలు నిర్వహిస్తే జనం రావడం గగనమే. స్థానిక పాలకులు అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలను పిలిపించి సభలను మమ అనిపిస్తున్నారు. పల్స్ పోలియో, ర్యాలీలు, బీఎల్వో విధులు ఇలా లెక్కలేనన్ని పనులు అప్పగిస్తున్నారు. ఇవన్నీ నోటి మాట ద్వారానే జరుగుతున్నాయి. పైఅధికారుల మాటలు కాదనలేక కార్యకర్తలు వింటూనే ఉన్నారు. ఇప్పుడు సీసీ కెమెరాలు, బయోమెట్రిక్ విధానాన్ని అమలులోకి తీసుకొస్తే.. కార్యకర్తలు కేంద్రాలను వదిలి బయటకు వెళ్లలేని పరిస్థితి ఉంటుంది.

పారదర్శకత మరింత మెరుగు..

ఒకవేళ స్థానిక పాలకులు, అధికారులు ఇతర పనులు అప్పగించాలని చూసినా ఒప్పుకోలేని పరిస్థితి. వీటన్నింటి నేపథ్యంలో ఈ విధానాన్ని సాధ్యమైనంత త్వరగా అమలు చేస్తే బాగుంటుందన్న అభిప్రాయం నిర్వాహకుల్లో వ్యక్తమవుతోంది. అంతేగాకుండా కేంద్రాల నిర్వహణలో పారదర్శకత మరింత మెరుగుపడుతుందని పేర్కొంటున్నారు. అప్పుడప్పుడు కేంద్రాల నుంచి బియ్యం, గుడ్లు దారి మళ్లుతున్నాయని, పౌష్టికాహారంలో నాణ్యత లోపిస్తోందని, వేళల ప్రకారం విధులు నిర్వర్తించడం లేదన్న ఆరోపణలు కార్యకర్తలపై వస్తున్నాయి. సీసీ కెమెరాలు, బయోమెట్రిక్ విధానాలతో వైవాటికి చెక్ పెట్టినట్లు అవుతోంది.

ఈటల కోడలు ఇంటింటి ప్రచారం



మేడ్చల్: మల్కాజ్‌గిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌కు ఓటు వేయాలని కోరుతూ ఆయన కోడలు క్షమిత పార్టీ పట్టణ నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని కిష్టాపూర్‌లో ఆమె నాయకులతో కలిసి కాలనీల్లో పర్యటించారు. కరపత్రాలను అందజేసి ప్రచారం చేశారు. గ్రామంలో డప్పు చప్పుళ్లతో ఊరేగింపు నిర్వహించారు. ప్రతి కాలనీలో తిరుగుతూ ఇంటింటికీ వెళ్లి ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకులు పాల్గొన్నారు

తీన్మార్ హోటల్ సిబ్బందిపై దాడి చేసిన వారిపై కేసు

ఘట్‌కేసర్: తీన్మార్ హోటల్ సిబ్బందిపై దాడి చేసిన వారిపై ఘట్‌కేసర్ పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. సీఐ సైదులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అవుషాపూర్‌కు చెందిన మణిదీప్, అఖిల్, అవినాశ్, అనుదీప్ స్థానిక తీన్మార్ హోటల్‌కు గురువారం రాత్రి 10 గంటలకు వెళ్లి హలీం తీసుకొని ఎక్స్‌ట్రా ప్లాస్టిక్ ప్లేట్లు కావాలని నిర్వాహకులతో గొడవకు దిగారు. అదనంగా ప్లేట్లు ఇవ్వలేదని సిబ్బందిపై దాడి చేశారు. దీంతో హోటల్ సిబ్బందికి గాయాలయ్యాయి. హోటల్ యాజమాన్యం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం



యాద్గార్‌పల్లిలో క్షేత్రస్థాయిలో వరి పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

కీసర: వ్యవసాయాధికారుల సూచన మేరకు రైతులు పంటల సాగు చేస్తే తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం సమకూర్చుకోవచ్చని ఏడీఏ ఆదిలక్ష్మి అన్నారు. యాద్గార్‌పల్లి రైతు వేదికలో పంటల సాగు, ఎరువుల తయారీ విధానంపై శుక్రవారం రైతులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె రాజేంద్రనగర్ ఏడీఏ దివ్యజ్యోతి, ఏఓ హిమబిందుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏడీఏ ఆదిలక్ష్మి మాట్లాడుతూ సేంద్రీయ వ్యవసాయం, తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు పొందడం ఎలా అని వివరించారు. సేంద్రీయ వ్యవసాయం గురించి వివరించారు. ఆవు మూత్రం ఔషధ గుణాలను వివరించడంతో పాటు వేస్ట్ డికంపోజర్ తయారీపై రైతులకు తెలియజేశారు. ఏడీఏ దివ్యజ్యోతి వర్మి కంపోస్టు తయారీ విధానంపై రైతులకు తెలియజేశారు. పచ్చిరొట్ట ఎరువులా వేసుకోవడం వల్ల భూసారాన్ని కాపాడవచ్చని వివరించారు. ఏఈఓ వందన, రైతులు, కొండల్‌రెడ్డి, జూపల్లి కృష్ణ, వచ్చ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

కుషాయిగూడ: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం కుషాయిగూడలోని మల్కాజిగిరి జిల్లా కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా కోర్టు అధికారులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌లో జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ బీఆర్ మధుసూదన్‌రావు, రాచకొండ సీపీ తరుణ్‌జోషి, జిల్లా కలెక్టర్ గౌతమ్ హాజరవుతున్నట్లు తెలిపారు. జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకొని సత్వర న్యాయం పొందాలని సూచించారు.

ఉచిత కుట్టు శిక్షణ శిబిరం

బోడుప్పల్: 15వ డివిజన్ పరిధిలో ఉన్న మహిళలకు ఈ నెల 17వ తేదీన ఉచిత కుట్టు మిషన్ శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆ డివిజన్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి సిగురు రేణుక రవికుమార్ వెల్లడించారు. బోడుప్పల్‌లో ఆమె శుక్రవారం మాట్లాడుతూ ఈ ఉచిత శిక్షణ పొందాలనుకునే మహిళలు తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ అవకాశం 15వ డివిజన్‌లో ఉన్న మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. నమోదు కోసం ఫోన్: 91000 33366.

ఎమ్మార్ఐఈటీలో టెక్నికల్ ఫెస్ట్ ప్రారంభం



టెక్నికల్ ఫెస్ట్ సావనీర్ ఆవిష్కరిస్తున్న అడ్వైజర్, ప్రిన్సిపాల్, అధ్యాపకులు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని ఎమ్మార్ఐఈటీ కళాశాలో జాతీయ స్థాయి టెక్నికల్ ఫెస్ట్ శుక్రవారం ప్రారంభమైంది. రెండు రోజుల పాటు నిర్వహించనున్న ఫెస్ట్‌ను కళాశాల అడ్వైజర్ డాక్టర్ అశోక్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రావు టెక్నోత్సవ్ సీడీ, సావనీర్ ఆవిష్కరించి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు తమ పరిజ్ఞానాన్ని విస్తృతం చేసుకోవడానికి టెక్నికల్ ఫెస్ట్‌లు, సాంకేతిక ప్రదర్శనలు, సదస్సులు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఇలాంటి ఫెస్ట్‌లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని, తమలోని నైపుణ్యాలను వెలికి తీయాలని కోరారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం టెక్నోత్సవ్ నిర్వహిస్తున్నామని ఈ ఏడాది జాతీయ సదస్సుకు వెయ్యికి పైగా రిజిస్ట్రేషన్లు నమోదయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఒత్తిడికి లోనుకావొద్దు



నాగారంలో హాల్ టికెట్లు పంపిణీ చేస్తున్న చైర్మన్ చంద్రారెడ్డి తదితరులు



కీసరలో టెన్త్ విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్స్ అందజేస్తూ..

కీసర: పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. మున్సిపల్ పరిధిలోని జెడ్పీహెచ్‌ఎస్ స్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు శుక్రవారం హాల్‌టికెట్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 18నుంచి ప్రారంభంకానున్న పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు సమయానికంటే ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలన్నారు. ఉత్తమ మార్కులు సాధించే విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తానన్నారు. కీసర ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు కీసర మాజీ ఎంపీటీసీ సభ్యుడు బెలిదే రమేష్, వసంత ఎగ్జామ్ ప్యాడ్స్ అందజేశారు. కార్యక్రమంలో నాగారం మున్సిపల్ కమిషనర్ రాజేంద్రకుమార్, ఎంఈఓ శశిధర్, ప్రధానోపాధ్యాయులు తిరుపతిరెడ్డి, ఉపాధ్యాయులు ప్రమీల, వనజ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ లక్ష్మీ చెక్కుల పంపిణీ



ఘట్‌కేసర్‌లో కల్యాణ లక్ష్మీ చెక్కులు పంపిణీ చేస్తున్న జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి, ఎమ్మెల్యే మల్లారెడ్డి



చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లారెడి కాంగ్రెస్ నాయకుడు వజ్రేష్‌యాదవ్

మేడ్చల్: గతంలో మంజూరైన కల్యాణ లక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్‌తో కలిసి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మేడ్చల్ మండలం, మున్సిపాలిటీ, గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలకు చెందిన 21 మంది లబ్ధిదారులకు వారు చెక్కులను అందజేశారు. మల్లారెడ్డి మీడియాతో మాట్లాడేందుకు ఇష్టపడలేదు. అంతా జంగన్న మాట్లాడతాడు అంటూ మైకుల ముందు నుంచి వెళ్లిపోయారు. ఎంపీపీ రజితరాజమల్లారెడ్డి, వైస్ ఎంపీపీ వెంకటేషం, ఎంపీడీఓ వసంతలక్ష్మీ, తహసీల్దార్ శైలజ, కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

64 మంది లబ్ధిదారులకు..

ఘట్‌కేసర్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉమ్మడి ఘట్‌కేసర్ మండలానికి చెందిన 64 మంది లబ్ధిదారులకు ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి అధ్యక్షతన శుక్రవారం జరిగిన సమావేశంలో కల్యాణ లక్ష్మీ చెక్కులు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా జెడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి, ఎమ్మెల్యే మల్లారెడ్డితో కలిసి హాజరయ్యారు. కమిషనర్ సాబేర్ అలీ, నాయబ్ తహసీల్దార్ సందీప్‌కుమార్‌రెడ్డి, వైస్ చైర్మన్ మాధవరెడ్డి, కౌన్సిలర్లు రమాదేవి, సంగీత, వెంకట్‌రెడ్డి, ఆంజనేయులుగౌడ్, నర్సింగ్‌రావు, ఎంపీటీసీలు భాస్కర్‌రెడ్డి, వినోద, మాజీ ఎంపీటీసీ కుమార్ ముదిరాజ్, టీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ సుధాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ వెంకటేశ్‌గౌడ్, కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శి ముత్యాలు యాదవ్, రాధాకృష్ణముదిరాజ్, నాగార్జున పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మీ చెక్కుల పంపిణీలో రసాభాసా



కల్యాణ లక్ష్మీ చెక్కుల పంపిణీలో కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తల రసాభాసా

శామీర్‌పేట్: మూడుచింతలపల్లి మండలంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం అధికారులు ఏర్పాటు చేశారు. మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి, స్థానిక జెడ్పీటీసీ, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్ హాజరయ్యారు. దీంతో మల్లారెడ్డి వెంట బీఆర్ఎస్ కార్యకర్తలు, హరివర్ధన్‌రెడ్డి, వజ్రేష్‌యాదవ్‌ల వెంట పెద్ద ఎత్తున కాంగ్రెస్ కార్యకర్తలు అక్కడికి చేరుకున్నారు. ఇరు పార్టీల అధినాయకులు, పార్టీలపై పోటాపోటీగా జైజైలు కొడుతుండటంతో కొద్దిసేపు ఘర్షణ వాతావరణం చోటుచేసుకుంది. తమ లీడర్లు కలుగజేసుకొని కార్యకర్తలకు నచ్చజెప్పారు. దీంతో ఎమ్మెల్యే మల్లారెడ్డి, జెడ్పీటీసీ హరివర్ధన్‌రెడ్డి కలిసి లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఎంపీపీ హారిక, వైస్‌ఎంపీపీ మంద శ్రీనివాస్‌రెడ్డి, స్థానిక ఎంపీటీసీ నాగరాజు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ లక్ష్మితో మహిళలకు మేలు

పోచారం: కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలతో మహిళలకు మేలు జరుగుతుందని ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. శనివారం పోచారం మున్సిపల్ కార్యాలయంలో కల్యాణ లక్ష్మి, షాదీ ముబాకర్ చెక్కులను 17 మంది లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకొని మేలు పొందాలన్నారు. కార్యక్రమంలో చైర్మన్ కొండల్‌రెడ్డి, వైస్ చైర్మన్ రెడ్యానాయక్, కమిషనర్ వేమనరెడ్డి, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

దొంగకు రెండేళ్ల మూడు నెలల జైలు

చైన్ స్నాచింగ్‌కు పాల్పడి మహిళను గాయపరిచిన దొంగ

మేడ్చల్: మహిళ మెడలోని బంగారు గొలుసును దొంగిలించి మహిళను గాయపరిచిన దొంగకు మేడ్చల్ న్యాయస్థానం రెండేళ్ల మూడు నెలల జైలు శిక్ష విధించింది. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కృష్ణమూర్తి తెలిపిన వివరాల ప్రకారం మేడ్చల్ జుడిషియల్ పరిధిలోని పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధి రాఘవేంద్రకాలనీలో నివాసముంటున్న పి.అనురాధ(52) జనవరి 19న 2022లో ఇంటి ముందు కూరగాయలు కొనుగోలు చేస్తుండగా గుజరాత్ రాష్ట్రం సోనాలి పార్క్‌కు చెందిన దొంగ గులబ్బాని అలియాస్ గుల్బాయ్(26) అనే దొంగ ద్విచక్రవాహనంపై వచ్చి ఆమె మెడలోని బంగారు గొలుసు తెంచుకొని పారిపోయాడు. ఈ క్రమంలో అనురాధ గాయపడింది. దీంతో ఆమె పేట్‌బషీరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు దొంగను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మేడ్చల్ అసిస్టెంట్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి రమేష్ శుక్రవారం పైవిధంగా తీర్పు వెల్లడించారు.

హెచ్‌ఐవీ నిర్మూలనపై అవగాహన సదస్సు

ఘట్‌కేసర్: తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, ఎన్‌ఎస్‌ఎస్ సంయుక్తంగా హెచ్‌ఐవీ నిర్మూలనపై శుక్రవారం వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ అడిషనల్ డైరెక్టర్ పి.ప్రసాద్, కాకతీయ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ నరసింహారావు, అసిస్టెంట్ డైరెక్టర్ యూత్ అఫైర్స్ రమేశ్ ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ప్రోగ్రామ్ ఆఫీసర్స్‌తో కలిసి సదస్సు ప్రారంభించారు. ఈ సందర్భంగా హెచ్‌ఐవీ సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. పుట్టుకతో హెచ్‌ఐవీతో బాధపడుతున్న యువతి సమాజంలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ డీన్ డాక్టర్ విజయకుమార్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ మల్లేశం, సాత్విక, మానస, చేతన, కుసుమ, సింధూ, మనీషా, ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు నవీన్, చిన్ని, శ్రీనివాస్‌రావు, మధుకర్, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.



ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తున్న అడిషనల్ డైరెక్టర్ ప్రసాద్